క్లుప్తంగా

నేడు స్పందన

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పార్వతి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకోరావచ్చని ఆమె పేర్కొన్నారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో సాయంత్రం 3 -5 గంటల మధ్యలో స్పందన ఉంటుందని చెప్పారు. ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్‌సెంటర్ ఫోన్: 08572-232745, వాట్సప్-9849907885కు సమస్యలు తెలియచేయవచ్చన్నారు.

నేడు పూతలపట్టులో..

పూతలపట్టు: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ విజయభాస్కర్ తెలిపారు. రైతులు, మండల ప్రజలు, తమ సమస్యలను అర్జీల రూపంలో తీసుకొచ్చి అందజేయాలని తెలిపారు.

వృద్ధుడికి సాయం



దుప్పట్లు అందచేస్తున్న దృశ్యం

చిత్తూరు రూరల్: నగరంలోని కట్టమంచి చెరువు వద్ద ఆదివారం వేకువజామున వర్షంలో తడుస్తూ ఓ వృద్ధుడు కనిపించాడు. వర్షానికి, చలికి వణుకుతూ ఉన్న ఆయన్ను పారిశుద్ధ్య కార్మికులు దాత పార్థసారథినాయుడు, మాతృసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కందకు సమాచారం అందించారు. ఈ మేరకు వారు అక్కడికి చేరుకుని, ఆ వృద్ధుడిని రైల్వే బ్రిడ్జి కిందకు తీసుకొచ్చారు. అనంతరం చలిని తట్టుకోవ డానికి వృద్ధునికి దుప్పట్లు, అల్పాహారం అందించి మానవత్వం చాటుకున్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పూతలపట్టు: చెన్నై శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం మంగళవారం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ శిబిరాన్ని మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొంది. పరీక్షల అనంతరం రోగులను ఉచిత బస్సు సౌకర్యంతో తీసుకెళ్లి, ఉచిత శస్త్ర చికిత్స చేసి తీసుకువస్తామన్నారు. వివరాలకు 9059592200ను సంప్రదించాలని కోరింది.

వలసజీవుల బతుకు పోరాటం

- వ్యవసాయ పనిముట్ల తయారీలో నిమగ్నం
- పలు ప్రాంతాల్లో టెంట్లు వేసుకుని విక్రయాలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న పనిముట్లు



సమ్మెట పనులు చేస్తున్న వలస కూలీలు

ఐరాల: కష్టాన్నే నమ్ముకున్న వారికి భాష, ప్రాంతంతో పనిలేదని నిరూపిస్తున్నారు మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చిన వలసజీవులు. ముడి ఇనుముతో వ్యవసాయ పనిముట్లను తయారుచేసి ఉపాధి పొందుతున్నారు. మధ్యప్రదేశ్ నుంచి నాలుగు కుటుంబాలు మండల కేంద్రంలోని వారపుసంత వద్ద వ్యవసాయ పనిముట్లను తమారు చేసి రైతులు, ఇతరులకు అమ్ముతున్నారు. కేవలం వ్యవసాయ పనిముట్లకే పరిమితం కాకుండా గృహాలకు అవసరమైన వస్తువులను తయారుచేస్తున్నారు. వరిపైరు కోతకు వచ్చే సమయంలో పనిముట్ల విక్రయాలు జోరందుకుంటాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో టెంట్లు వేసుకుని తాత్కాలికంగా పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు.

అందరూ కష్టపడితేనే

వలస వచ్చిన వీరందరూ కావల్సిన డబ్బును సంపాదించుకునేందుకు కుటుంబమంతా కలిసికట్టుగా పనిచేస్తారు. మహిళలు కొలిమి వేసి పాత ఇనుము కాలిస్తే పురుషులు సమ్మెట వేస్తూ వస్తువులు తయారుచేస్తుంటారు. గొడ్డలి, కొడవలి, కత్తులు, గడ్డపారలు, పారలు సమ్మెట వంటి వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తున్నారు. పెద్దలు తయారు చేసిన వస్తువులను చిన్నారులు ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తూ బతుకు పోరాటం చేస్తున్నారు.

జీవనోపాధి కోసం..



మా ప్రాంతంలో పంటలు సక్రమంగా పండకపోవడంతోనే జీవనోపాధి కోసం ఈ రంగాన్ని ఎంచుకున్నాం. మా పెద్దలు నుంచి వ్యవసాయ పనిముట్లను తయారు చేసే పనులు నేర్చుకున్నాం. చేసిన వస్తువులను రైతులకు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాం. సుమారు నెల రోజుల పాటు ఇక్కడ రైతులకు అందుబాటులో ఉంటూ పనిముట్లు తయారుచేస్తాం

–అర్జున్, వలస కూలీ, మధ్యప్రదేశ్

పని సులువవుతుంది



గతంలో మాదిరిగా గ్రామాల్లో వ్యవసాయ పనిముట్లు తయారు చేసే వారు కరువయ్యారు. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వారంతా అక్కడక్కడా టెంట్లు వేసి వ్యవసాయ పనిముట్లు తయారుచేస్తున్నారు. అవన్నీ వ్యవసాయ పనులకు పనికొచ్చేవే. వాటిని కొనుగోలు చేసి ఉపయోగించుకొంటున్నాం.

–అమర్నాథ్‌రెడ్డి, రైతు, వినాయకపురం

నేడు రైతులతో సమావేశం

గుడిపాల: మండలంలోని పాపసముద్రం రైతుభరోసా కేంద్రంలో రైతులకు సోమవారం గ్రామసభ నిర్వహించనున్నట్లు వ్యవసాయధికారి మాధవి తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ పంట నమోదు వివరాలను చదివి వినిపించనున్నట్లు చెప్పారు. ఈ పంటలో ఏమైనా అభ్యంతరాలుంటే రైతులు తెలియజేయవచ్చన్నారు. రైతులకు యూరియా రూ.267కే ఆర్‌బీకేల్లో ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

నేడు వాహనాల వేలం

గుడిపాల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. సోమవారం వాహనాల వేలం వేయనున్నట్లు ఆయన తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ఉద్యమాన్ని ఆపలేరు

చిత్తూరు కార్పొరేషన్: జీఓ నెంబరు 1 రద్దు చేయాలని కోరుతూ తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ తెలిపారు. పోలీసుల ద్వారా నోటీసులు ఇవ్వడం అన్యాయమన్నారు. ప్రతిపక్ష పార్టీలు రోడ్‌షోలు, సభలు, సమావేశాలు నిర్వహించకుండా విడుదల చేసిన ఆ జీఓను వెంటనే రద్దు చేయాలన్నారు. పోలీసులను ఉపయోగించి ఉద్యమాలను ఆపలేరని చెప్పారు.

26 నుంచి శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు

తవణంపల్లె: మండల కేంద్రంలోని పురాతనమైన కోదండరామస్వామి దేవస్థానంలో ఈ నెల 26 నుంచి శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు తెలిపారు. ఉభయదారుల సహకారంతో వాహన సేవలను వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. 26వ తేదీ ఉదయం ధ్వజారోహణం, రాత్రిలో హంస వాహన సేవ, 27న ఉదయం సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, పూజలు, రాత్రిలో శేష వాహనం సేవ నిర్వహిస్తామని వివరించారు. 28న ఉదయం స్వామికి అభిషేకం, పూజలు, రాత్రిలో సింహ వాహన సేవను ఘనంగా నిర్వహిస్తామన్నారు. 29న ఉదయం స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు, రాత్రి హనుమంత వాహన సేవను వైభవంగా నిర్వహిస్తామన్నారు.



ఆలయంలో కొలువైన సీతారామలక్ష్మణులు

30న గురువారం శ్రీరామ నవమి పురస్కరించుకొని ఉదయం అభిషేకం పూజలు, మూడు కొబ్బరి చెట్లకు పూజలు, 12 గంటల నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సీతారాముల కల్యాణం, రాత్రి గరుడ వాహన సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామన్నారు. 6 గంటలకు స్వామి వారి లడ్డూ వేలంపాట, ఉదయం నుంచి రామకోటి భజనలు, కోలాటలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 31న శుక్రవారం ఉదయం స్వామికి అభిషేకం, రాత్రిలో పుష్పక విమాన సేవ, ఏప్రిల్ 1న శనివారం ఉదయం అభిషేకం, రాత్రిలో పల్లకి సేవ, 2న ఉదయం స్వామికి అభిషేకం, సాయంత్రం అఖండ కర్పూర హారతి, 3న ఉదయం స్వామికి అభిషేకం, 10 గంటలకు చక్రస్నానం నిర్వహించనున్నట్లు వివరించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన





గుడిపాల: కంటి వైద్య శిబిరం చేస్తున్న వైద్యులు, శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న రోగులు

గుడిపాల: మండలంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వసంతాపురం సర్పంచ్ రజినీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి అరవింద్ ఆస్పత్రి వైద్యులు నరహరిపేట జెడ్పీ హైస్కూల్లో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి 157 మంది రోగులు హాజరుకాగా ఇందులో 27 మందిని ఆస్పత్రికి ఆపరేషన్ కోసం రెఫర్ చేశారు. అనంతరం వారందరినీ తిరుపతిలోని అరవింద్ ఆస్పత్రికి వారు తీసుకెళ్లారు. కార్యక్రమంలో డాక్టర్‌లు బిష్వజిత్, భావ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, రోటరీక్లబ్ సభ్యులు సుధాకర్‌రెడ్డి, దామోదర్‌గుప్త, సిఎకెదత్, రామకృష్ణ, అనుపమదత్, శారద, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆసరాతో మహిళల్లో ఆనందం

గుడిపాల: సంక్షేమ క్యాలెండర్ ప్రకారం మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడతను ప్రభుత్వం ప్రకటించడంతో మహిళల్లో ఆనందం వ్యక్తమవుతోందని ఏపీఎం ఈశ్వరి తెలిపారు. వైఎస్సార్ ఆసరాతో లబ్ధిపొందుతున్న సంఘాల వివరాలను ఆమె ఆదివారం మీడియాతకు తెలియజేశారు. అనంతరం 189కొత్తపల్లె, వసంతాపురం సంఘాల సభ్యులు ఇంటికి వెళ్లి ఆసరా నిధుల లభ్యతపై వారికి తెలియజేశారు. ఏపీఎం మాట్లాడుతూ సీఎం చేతుల మీదుగా ఈనెల 25వ తేదీన ఆసరా నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఒక్కో మహిళా సంఘానికి ఎంతమేరకు ఆసరా నిధులు వస్తున్నాయో సంఘమిత్రలు ఇంటింటికీ వెళ్లి మహిళా సభ్యులకు తెలియజేస్తున్నట్లు వివరించారు. మండలంలో మూడవ విడతలో 763 సంఘాలకు 6.69 కోట్లు వారి ఖాతాలకు జమ కానున్నట్లు ఆమె తెలియజేశారు.



వసంతాపురంలో మహిళాసభ్యులకు అవగాహన కల్పిస్తున్న సంఘ మిత్రలు

పర్యావరణానికి మేలు చేసే పిచ్చుకలను కాపాడండి

చిత్తూరు రూరల్: నగరంలోని శ్రీ రామకృష్ణ ఆశ్రమంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పిచ్చుకల దినోత్సవాన్ని జరుపుకున్నారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని పిచ్చుకల గూడును తయారు చేశారు. మానవాళికి పిచ్చుకల ఆవశ్యకత, పర్యావరణానికి కలిగే మేలును జన విజ్ఞాన వేదిక సభ్యులు విద్యార్థులకు వివరించారు. పిచ్చుకలు రైతులకు మిత్రులని, పంటను నాశనం చేసే అనేక రకాల కీటకాలను చంపి పంటలకు మేలు చేస్తాయని తెలిపారు. అనంతరం పిచ్చుక గూళ్లను తయారు చేసిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సభ్యులు అరుణ శివప్రసాద్, నేచర్‌మురళి, సుధాకర్, రమేష్, వెంకటరత్నం, వేలు తదితరులు పాల్గొన్నారు.



పిచ్చుక గూళ్ల ప్రదర్శనలో సభ్యులు, విద్యార్థులు

కొండమల్లీశ్వర స్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రదోషకాల పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శివునికి నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకుముందు కొండమల్లీశ్వర స్వామికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం ప్రదోష పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనారాయణ స్వామివారి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. వివిధ రకాల పూలు, ఆభరణాలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. పరిమళాలు వెదజల్లే సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అశేష భక్తుల నడుమ అర్చకులు శ్రీదేవి, భూదేవి మెడలో మాంగల్యధారణ చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

ఎస్వీసీఆర్ పూర్వ విద్యార్థుల సేవలు ఘనం



శ్రీ వర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పలమనేరు: పట్టణంలోని శ్రీవర్ర చెన్నారెడ్డి (ఎస్వీసీఆర్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల సేవలు ఘనమైనవని కళాశాల వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం పేర్కొన్నారు. నాక్ మూల్యాంకనం నేపథ్యంలో ఆదివారం స్థానిక కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఈ సంఘం గౌరవాధ్యక్షుడిగా చెంగారెడ్డి, అధ్యక్షుడిగా బాలాజీ, ఉపాధ్యక్షుడిగా పూసల రవి, కార్యదర్శిగా పవన్, సంయుక్త కార్యదర్శిగా బాలాజీ, కోశాధికారిగా కుమార్‌శెట్టి, కార్యవర్గ సభ్యులుగా నూతన్‌ప్రసాద్, నాగరాజు, వరలక్ష్మి, చలపతి ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు నారాయణమూర్తి రూ.20 వేలు, హఫీ, హరికృష్ణ ఒక్కొక్కరు రూ.10 వేలు, విక్రమరాజు రూ.5 వేలను విరాళంగా అందజేశారు. ఈనెల 27న జరిగే నాక్ మూల్యాకనంలో ఉత్తమ గ్రేడింగ్‌కు పూర్వ విద్యార్థులు మరింతగా కృషి చేయాల్సిన అవసరం ఉందని వైస్ ప్రిన్సిపల్ కోరారు. కళాశాల అభివృద్ధికి సహకరించిన పూర్వ విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తవణంపల్లెలో 22 మి.మీ. వర్షపాతం

తవణంపల్లె: మండలంలో శనివారం రాత్రి కుండపోత వర్షం కురడంతో 22.04 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కానీ మిరప, చింత పంట వడుపుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కానీ మామిడి పంటకు అనుకూలంగా ఉంటుందని రైతులు వ్యక్తం చేస్తున్నారు. పడమట అడవుల్లో వర్షం బాగా కురవడంతో మాధవరం వంకలో నీటి ప్రవాహం మొదలైంది.

మోస్తరు వర్షం

ఐరాల: మండలవ్యాప్తంగా ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రబీలో వరి సాగు చేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మరోపక్క మామిడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మామిడి తోటలకు నష్టం

పలమనేరు: మండలంలోని మండిపేటకోటూరు, పెంగరగుంట పంచాయతీల్లో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. సుమారు 50 ఎకరాల్లోని తోపుల్లోని పిందె, పూత నేలరాలింది. కొన్నితోటల్లో మూడు రోజుల క్రితం పడిన వర్షానికి దెబ్బతిన్న మామిడి కాయలపై మచ్చలు పడ్డాయి.



తవణంపల్లెలో కురుస్తున్న వర్షం

టీకాలే పశువులకు శ్రీరామరక్ష

- గాలికుంటు వ్యాధిపై అప్రమత్తత అవసరం
- జీవాలు వ్యాధి బారిన పడే అవకాశం
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం
- ముమ్మరంగా కొనసాగుతున్న వ్యాక్సినేషన్





చిత్తూరు: పాడి ఆవులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది, యాదమరి: గాలికుంటు వ్యాధికి పాడి ఆవులకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్/యాదమరి: పశువులకు టీకాలు శ్రీరామరక్ష అని పశువైద్యులు చెబుతున్నారు. వాతావరణ మార్పులు మొదలవగానే పశువులు ముఖ్యంగా గాలికుంటు వ్యాధి బారినపడే అవకాశం ఉంది. సకాలంలో వ్యాక్సిన్ వేస్తే వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చు. సకాలంలో వైద్యం అందకపోతే పశువులు మృత్యువాత పడే అవకాశముంది. ఈ నేపథ్యంలో జీవాలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ఉచిత టీకాల కార్యక్రమం చేపట్టింది. ప్రస్తుతం డివిజన్ వ్యాప్తంగా అన్ని పశు వైద్యశాలల ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ ముమ్మరంగా సాగుతోంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవాలను కాపాడుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు.

ట్యాగ్ ఆధారంగా టీకాలు

డివిజన్ పరిధిలోని పశువైద్య సిబ్బంది గతేడాది పశువులకు ట్యాగ్‌లు వేశారు. ప్రస్తుతం ట్యాగ్ ఆధారంగా పశువులను గుర్తించి టీకాలు వేస్తున్నారు. ఇప్పటి వరకు పశువులకు ట్యాగ్ వేయించుకోకపోతే ట్యాగ్ వేయించుకోవాలని పశువైద్యులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. చిత్తూరు డివిజన్‌లో గేదెలు 1036 ఉండగా, ఆవులు 4,67,507 ఉన్నాయి. ఇప్పటివరకు డివిజన్‌లోని రైతు భరోసా, పశువైద్యకేంద్రాల పరిధిలో 2 లక్షల జీవాలకు టీకాలు వేశారు. ఈ నెలాఖరు వరకు టీకాల కార్యక్రమం కొనసాగుతుందని పశువైద్యాధికారులు చెబుతున్నారు.

వ్యాధి లక్షణాలు

- ముందుగా పశువు నోటి నుంచి చొంగ కారడం ప్రారంభం అవుతుంది. ఇదే సమయంలో పక్కవాటికి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వ్యాధి సోకిన వాటికి 105 డిగ్రీల వరకు జ్వరం వస్తుంది.
- ఆహారం సరిగ్గా తీసుకోలేవు
- నోట్లో, కాలి గిట్టల్లో పుండు ఏర్పడుతాయి.
- నెల రోజుల వయసున్న దూడలు, ఈ వ్యాధి ఉన్న పశువుల పాలు తాగితే వ్యాధి సోకి మరణించే అవకాశం ఉంది.
- ఈ వ్యాధి సోకిన పశువులు ఎండలో ఎక్కువ సేపు ఉండలేవు.
- దుక్కిదున్నే పశువులు కాళ్ల మట్టలు కదిలిపోవడం వద్ద పనికి పనికిరావు.


నివారణ ఇలా..

వ్యాధి సోకిన వెంటనే పశువులను గుర్తించి గుంపు నుంచి వేరుచేసి విడిగా కట్టేయాలి. ఇలా చేయకపోతే ఇతర పశువులకు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. వెంటనే పశువైద్యుడిని సంప్రదించి వైద్యం చేయించాలి. వ్యాధి సోకక ముందు ఎఫ్ఎండీ వ్యాక్సిన్ వేయించాలి. సోకిన తరువాత పెన్సిలిన్, యాంటీ ఇస్టమిన్, యాంటీ ఇన్లమేటరీ డ్రగ్స్ వాడుతూ నోటిలో, గాలి గిట్టల మధ్య గ్లిజరిన్‌తో శుభ్రం చేసి బోరిక్ పౌడర్ పట్టించాలి.

పూతలపట్టు నియోజకవర్గంలో..

పశువులకు తరచూ గాలికుంటు వ్యాధి వస్తుంది. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రెండు సార్లు గాలికుంటు వ్యాధి టీకాలు వేసేందుకు చర్యలు తీసుకుంది. పూతలపట్టు నియోజకవర్గ పరిధిలో 52 వేల పశువులకు 129 మంది సిబ్బంది టీకాలు వేసేందుకు లక్ష్యం నిర్ణయించుకున్నారు. ఈ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా పశువైద్యాశాఖ జేడీ విజయమోహన్ వివరించారు.

వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలి



పశువులకు గాలికుంటు వ్యాధి సోకకముందు వ్యాక్సిన్ వేయించాలి. వ్యాధి వచ్చినట్లు గుర్తిస్తే వెంటనే పశువైద్యులను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది. వ్యాధి వచ్చిన తరువాత కంటే రాకముందు వ్యాక్సిన్ వేయిస్తే మంచిది. పశువైద్యుల దృష్టికి పశువులకు వ్యాధి సోకిన విషయం తెలిస్తే వైద్యం అందించి రోగం ప్రబలకుండా నివారించవచ్చు. లేకపోతే చనిపోతాయి.

–ప్రభాకర్, పశు సంవర్ధక శాఖ డీడీ